ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -27 పేజీలు - 8 వెల - 03/- గురువారం14 మే 2026

## బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు

### 6నుంచి 15 శాతానికి పెంచిన కేంద్రం




**న్యూఢిల్లీ, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం తాజాగా పెంచింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను 5 శాతానికి పెంచింది. దీంతో, మొత్తం దిగుమతుల సుంకం 15 శాతానికి చేరింది. గతంలో ఇది 6 శాతంగా ఉండేది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 95.75కి పతనమైన నేపథ్యంలో **మిగతా 2లో...**

## చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం



కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన ప్రధాని
అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
పలు రాష్ట్రాల సిఎంలు కూడా పొదుపుబాట

**న్యూఢిల్లీ, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు దిగుమతులపై **మిగతా 2లో...**

## విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు
విశ్వాస పరీక్షను బహిష్కరించిన డీఎంకె
అనాడీఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు
ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్



**చెన్నై, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును **మిగతా 2లో...**

# అభివృద్ధిని రాష్ట్రమంతా విస్తరిస్తున్నాం

## కిమ్స్ ఆసుపత్రి శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

అమరావతితో పాటే విశాఖ అభివృద్ధి
అక్కడ ఇప్పటికే అనేక సంస్థలు రాక
టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ
తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ అభివృద్ధి
కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు



**అమరావతి, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
అభివృద్ధి విషయంలో ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని.. విశాఖనూ విశ్వనగరంగా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖను ఐటి పరంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే అనేక ప్రాజెక్టులు అక్కడ వచ్చాయని అన్నారు. రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి **మిగతా 2లో...**



## ఖరీఫ్ సీజన్‌లో14 పంటలకు మద్దతు ధర పెంపు

ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం
రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు
క్వింటాల్ వరికి రూ. 2,441గా మద్దతు ధర

**న్యూఢిల్లీ మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
2026-27 మార్కెటింగ్ సీజన్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ను పెంచడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పశ్చిమాసియా సంక్షోభం, పెరుగుతున్న గ్లోబల్ ఆయిల్ రేట్స్, ఇంధన సంరక్షణ, వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసెస్, బంగారం కొనుగోళ్ల వాయిదాపై చర్చించినట్టు సమాచారం. **మిగతా 2లో...**

## నేడు ఎపి కేబినేట్ భేటీ
### పలు కీలక అంశాలపై చర్చ



## 15న ఆధారాలతో విచారణకు వస్తా
### పోలీసులకు బండి భగీరథ్ లేఖ



## నీట్ ప్రశ్నాపత్రం లీక్ కేసులో కదులుతున్న డొంక

### రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నాపత్రం కొనుగోలు!

గురుగ్రామ్ వైద్యుడి నుంచి పొందిన రాజస్తాన్ సోదరులు
పరీక్షకు వారం ముందే ఈ వ్యవహారం -సికార్ కేంద్రంగా దేశవ్యాప్తంగా లీక్
దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు -ఇప్పటికి ఐదుగురి అరెస్ట్




**న్యూఢిల్లీ : మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ యూజీ-2026 ప్రశ్నాపత్రం లీక్ కేసులో దర్యాప్తు ముమ్మరమవుతోంది. రాజస్తాన్‌లోని జామ్‌వా రామ్‌గఢ్‌కు చెందిన మంగీలాల్, దినేష్ బివాల్ అనే ఇద్దరు సోదరులు పరీక్షకు వారం ముందే హర్యానాలోని గురుగ్రామ్‌కు చెందిన ఓ డాక్టర్ నుంచి రూ.30 లక్షలకు ప్రశ్నాపత్రాన్ని కొనుగోలు చేసినట్టు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అనంతరం ఆ ప్రశ్నాపత్రాన్ని వారు పలువురు అభ్యర్థులకు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి.
**మిగతా 2లో...**



## ఫ్యూచర్ సిటీలో ఉబర్

### సీఎంతో ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహి భేటీ

పార్కింగ్ సమస్యపై దృష్టిపెట్టండి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

**హైదరాబాద్ మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉబర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. **మిగతా 2లో...**

## సైబర్ నేరాలు అరికట్టండి

### అధికారులకు సిఎం ఆదేశం



**అమరావతి : మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
సైబర్, ఆర్థిక నేరాలు అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల్లో తక్షణ స్పందన-ఎపిలో నియంత్రణా వ్యవస్థలపై సచివాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న సొమ్మును రాబట్టేందుకు గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ టెక్నాలజీలపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఈ అంశంపై అవసరమైతే రిజర్వు బ్యాంకును సంప్రదించాలని తెలిపారు. **మిగతా 2లో...**

# బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు

**మొదటిపేజీ తరువాయి**

అప్రమత్తమైన ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచింది. బంగారం వినియోగంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం భారత్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇక ఈక్విటీ మార్కెట్‌లో రాబడులు మందగించిన నేపథ్యంలో గతేడాది భారత్‌లో బంగారానికి డిమాండ్ పెరిగింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఆధారిత ఎక్స్‌చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 186 శాతం మేర పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ధరలు అధికంగా ఉన్నందున కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బంగారం, వెండి దిగుమతుల కట్టడి కోసం ఇటీవల ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్‌టీ విధించింది. దీంతో, బ్యాంకులు దిగుమతులకు దాదాపు నెల రోజుల పాటు బ్రేక్ చెప్పాయి. ఫలితంగా ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల నాటి కనిష్ఠాన్ని తాకాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను తట్టుకునేందుకు దేశ ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ ఆదివారం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

# చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

**మొదటిపేజీ తరువాయి**

ఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించినట్టు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రొటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంల కాన్వాయ్ కుదింపునకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.?

# ఫ్యూచర్ సిటీలో ఉబర్

**మొదటిపేజీ తరువాయి**

బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా ఖోస్రోషాహి వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ ఎక్సెలెన్స్ సెంటర్ ను విస్తరిస్తున్నట్టు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేననీ, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్టు ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తిగా ఉన్నామని దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ చార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.

హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామనీ, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీవో) మధు కన్నన్, ఉబెర్ ఇండియా సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

**మొదటిపేజీ తరువాయి**

నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్‌ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది‘ అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది.

అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు. ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ‘ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది‘ అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు.అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

# ఖరీఫ్ సీజన్‌లో 14 పంటలకు మద్దతు ధర పెంపు

**మొదటిపేజీ తరువాయి**

అలాగే, ఖరీఫ్ సీజన్ మద్దతు ధరల నుంచి కోల్ గ్యాసిఫికేషన్, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయ ఆధునికీకరణ వరకు భారీ కేటాయింపులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగల్ ఇచ్చింది.

ఖరీఫ్ సీజన్‌లో 14 పంటలకు మద్దతు ధర పెంపు నకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఆయా పంటలకు క్వింటాకు పెంచిన ధరలు ఇలా ఉన్నాయి.

**కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి రూ.37,500 కోట్లు**

దేశంలో బొగ్గు వినియో గాన్ని ఆధునికీకరించేందుకు కోల్/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.37,500 కోట్ల కేటాయింపునకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో దిగుమతి ఇంధనాల పై ఆధారాన్ని తగ్గిం చడంతో పాటు దేశీయ పరి శ్రమలకు మద్దతు లభించనుంది.

**గుజరాత్‌లో సెమీ హైస్పీడ్ రైల్వేలైన్‌కు గ్రీన్ సిగ్నల్**

గుజరాత్‌లోని అహ్మదా బాద్ జిల్లాలోని సర్కేజీ ధోలేరా మధ్య సెమీ హైస్పీడ్ డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 134 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.20,667 కోట్లుగా పేర్కొంది. 2030–31 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కానుంది.

**పీపీపీ కింద నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ**

మహారాష్ట్రలోని నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రభుత్వ, ప్రయి వేట్ భాగస్వామ్యం (పీపీపీ) కింద ఆధునికీకరించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్త సదుపాయాలు, విస్తరణ పనులతో విమానాశ్రయ సేవలు మరింత మెరుగుపడనున్నాయని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు.

| | |
|---|---|
| ఒడిసలు | రూ.10,052 |
| వరి (సాధారణ రకం) | రూ.2,441 |
| వరి (గ్రేడ్ ఏ) | రూ.2,461 |
| హైబ్రిడ్ జొన్నలు | రూ.4,023 |
| మల్దండి జొన్నలు | రూ.4,073 |
| సజ్జలు | రూ. 2,900 |
| రాగులు | రూ.5,205 |
| మొక్కజొన్న | రూ. 2,410 |
| కందులు | రూ. 8,450 |
| పెసర్లు | రూ.8,780 |
| మినుములు | రూ.8,200 |
| పత్తి (మధ్యరకం) | రూ.8,267 |
| పత్తి (లాంగ్ రకం) | రూ. 8,667 |
| వేరుశనగ | రూ.7,517 |
| పొద్దుతిరుగుడు | రూ.8,343 |
| సోయాబీన్ | రూ.5,708 |
| నువ్వులు | రూ.10,346 |

# నీట్ ప్రశ్నాపత్రం లీక్ కేసులో కదులుతున్న డొంక

**మొదటిపేజీ తరువాయి**

**ప్రశ్నాపత్రాన్ని తన కుమారుడినకి అందించిన నిందితుడు**

దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన ఇద్దరు సోదరుల్లో ఒకరు గురుగ్రామ్ వైద్యుడి నుంచి కొనుగోలు చేసిన ఆ ప్రశ్నాపత్రాన్ని నీట్‌కు సిద్ధమవుతున్న తమ కుమారుడికి అందించారు. ఆ తర్వాత వారు ఏప్రిల్ 29న సికార్‌లో పలువురికి విక్రయించినట్టు సమాచారం. దీంతో రాజస్తాన్‌లోని సికార్ ఈ ఏడాది పేపర్ లీక్ వ్యవహారానికి కేంద్రబిందువుగా మారింది. జామ్‌వా రామ్‌గఢ్ నుంచి ప్రశ్నాపత్రం ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఏజెంట్ రాకేశ్ కుమార్ మండావారియాకు చేరగా, ఆయన దానిని మరొకరికి విక్రయించాడు. కోచింగ్ సెంటర్ల పరిసరాల్లో కార్యకలాపాలు నిర్వహించే రాకేశ్.. ఆ పేపర్‌ను రూ.30 వేలకు కేరళలో ఎంబీబీఎస్ చదువుతున్న సికార్‌కు చెందిన ఓ విద్యార్థికి అమ్మినట్టు ఆరోపణలు ఉన్నాయి.

**ఓ హాస్టల్ ఓనర్‌కు చేరిన ప్రశ్నాపత్రం**

అటు తర్వాత పరీక్షకు ఒక రోజు ముందు సదరు విద్యార్థి సికార్‌లో పీజీ హాస్టల్ నడుపుతున్న తన తండ్రికి వాట్సాప్ ద్వారా ప్రశ్నాపత్రం పంపాడు. సికార్‌లోని ఒక స్నేహితుడి నుంచి తనకు ఈ ప్రశ్నాపత్రం అందిందనీ, హాస్టల్‌లో ఉన్న బాలికల (విద్యార్థినులు)కు దీనిని ఇవ్వాలని ఆ విద్యార్థి తన తండ్రికి చెప్పాడు. రేపు జరిగే పరీక్షలో ఇవే ప్రశ్నలు వస్తాయని కూడా చెప్పినట్టు దర్యాప్తులో తేలింది. అనంతరం ఆ ప్రశ్నాపత్రం హాస్టల్‌లో ఉన్న పలువురికి చేరినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా ఈ కేసులో గురుగ్రామ్ డాక్టర్ కీలక పాత్రధారిగా ఉన్నాడు. ఈ ప్రశ్నాపత్రం మొదట మహారాష్ట్రలోని నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి చైన్ నెట్‌వర్క్ ద్వారా గురుగ్రామ్ వైద్యుడి వద్దకు చేరిందని, అక్కడి నుంచి రాజస్తాన్ సోదరులు ఇద్దరు కొనుగోలు చేసి, ఇతరులకు విక్రయించినట్టు రాజస్తాన్ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఓజీ) అనుమానిస్తోంది. అయితే గురుగ్రామ్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షుడు డా.రాజేశ్ కతారియా మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై గురుగ్రామ్ వైద్యుడి గురించి తమను ఇప్పటివరకు ఎలాంటి దర్యాప్తు సంస్థ కూడా సంప్రదించలేదని తెలిపారు.

**ప్రశ్నాపత్రం లీకేజీపై నెలరోజుల ముందే సమాచారం**

దర్యాప్తులో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. అరెస్టయిన సోదరులకు నెల రోజుల ముందే పేపర్ లీక్ అవుతుందని సమాచారం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరిలో దినేశ్‌కు ఒక రాజకీయ పార్టీతో సంబంధం ఉన్నట్టు కూడా సమాచారం. వీరి కుటుంబానికి చెందిన నలుగురు విద్యార్థులు నీట్‌లో అర్హత సాధించినట్టు కూడా దర్యాప్తు వర్గాలు చెప్తుండటం గమనార్హం.

**సికార్‌లో వాట్సాప్, టెలిగ్రామ్ తో ప్రశ్నాపత్రం షేరింగ్**

ఇక ఈ ప్రశ్నాపత్రం లీకైన సికార్‌లో విద్యార్థులు, కోచింగ్ నిర్వాహకులు కలిసి వాట్సాప్, టెలిగ్రాఘమ్ గ్రూపు ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా ప్రశ్నాపత్రాన్ని పంచుకున్నట్టు తెలుస్తోంది. నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి హర్యానా, జామ్‌వా రామ్‌గఢ్ మార్గంగా సికార్‌కు చేరిన ప్రశ్నాపత్రం , ఆ తర్వాత అక్కడి నుంచి జమ్మూకాశ్మీర్, బీహార్, కేరళ, ఉత్తరాఖండ్‌లకు వ్యాపించినట్టు అధికారులు అనుమానిస్తున్నారు.

**700 మందికి పంపిణీ చేసిన రాకేశ్ కుమార్**

కాగా డెహ్రాడూన్‌లో అరెస్టయిన రాకేశ్ కుమార్ మండావారియా దాదాపు 700 మంది విద్యార్థులకు ప్రశ్నాపత్రాన్ని పంపిణీ చేసినట్టు సమాచారం. అనంతరం ఆ పీడీఎఫ్ విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో పాటు ప్రింటెడ్ కాపీల రూపంలో కూడా విక్రయించబడినట్టు సమాచారం. హర్యానాలో పేపర్ విక్రయించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న యశ్ యాదవ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో కూడా ఈ కేసుకు సంబంధించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో నీట్ పరీక్ష లీక్ వ్యవహారంలో ఇప్పటికీ ఐదుగురు అరెస్టయ్యారు. ఈనెల 3న నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్షను కేంద్ర ప్రభుత్వం అనుమతితో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం రద్దు చేసిన విషయం విదితమే. అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కేంద్రం ఆదేశించడంతో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కొత్త పరీక్ష తేదీలను 7 నుంచి 10 రోజుల్లో ప్రకటిస్తామని ఎన్‌టీఏ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో సీబీఐ క్రిమినల్ కుట్ర, మోసం, నమ్మకద్రోహం, సాక్ష్యాల ధ్వంసం తదితర అభియోగాలతో కేసు నమోదు చేసింది. అలాగే అవినీతి నిరోధక చట్టం, పబ్లిక్ ఎగ్జామినేషన్ ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్ యాక్ట్–2024 కింద కూడా కేసులు నమోదు చేసింది.రాజస్తాన్ పోలీసుల ఎస్ఓజీ స్వాధీనం చేసుకున్న ”కెమిస్ట్రీ గెస్ పేపర్”లో ఉన్న 410 ప్రశ్నల్లో దాదాపు 120 ప్రశ్నలు అసలు పరీక్షలో వచ్చినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు.

# 15న ఆధారాలతో విచారణకు వస్తా

## పోలీసులకు బండి భగీరథ్ లేఖ

**హైదరాబాద్, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**

పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

# సైబర్ నేరాలు అరికట్టండి

**మొదటిపేజీ తరువాయి**

ఆర్థిక, సైబర్ నేరాల్లో ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయనే అంశంపై సిఎం కొన్ని సూచనలు చేశారు. ఆధార్ ఆథంటికేషన్, కెవైసి వంటివి లేకుండా ప్రారంభిస్తున్న షెల్ కంపెనీలపై అధ్యయనం చేయాలన్నారు. బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖల సమన్వయంతో ఆన్ లైన్ ఆర్థిక మోసాల విషయంలో ఓ నియమావళిని సిద్ధం చేయాలని నిర్దేశించారు. అనుమానిత బ్యాంకు ఖాతాలను ఫ్లాగ్ చేసే అంశాన్ని పరిశీలించి, ఖాతాదారుల ప్రయోజనాలు రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యుపిఐ పేమెంట్స్ ద్వారా మిలియన్ల సంఖ్యలో ఆర్థిక లావాదేవీలు క్షణాల్లో జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ అంశంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో ఎపిటిఎస్ ముఖ్య భూమిక పోషించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీలను అధ్యయనం చేయాలని సూచించారు. అన్ని బ్యాంకులు వారాంతాల్లో పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలపై దృష్టి పెట్టాలని చెప్పారు. కొన్ని నిబంధనల్ని మార్చుకునే విషయంలో రిజర్వు బ్యాంకును సంప్రదించాలని అన్నారు. హర్యాణా, మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాల్ని అధ్యయనం చేసి ఓ నిర్దిష్టమైన కార్యాచరణ సిద్ధంచేయాలని చెప్పారు. దీంతో పాటు ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

# అభివృద్ధిని విస్తరిస్తున్నాం

**మొదటిపేజీ తరువాయి**

వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి బుధవారం సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ‘రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం. ఆ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం మారబోతోంది. రాయలసీమ ’టెక్నాలజీ హబ్’గా తయారవుతోంది. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయి. శ్రీసిటీ.. ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైందని వివరించారు. ఇకపోతే కిమ్స్ అధినేత భాస్కర్‌రావు ఒక విజన్ ఇచ్చారు. 2027 మే 13న కిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తాం అన్నారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. 2028 డిసెంబరులోపు ఫేజ్–1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చాం. ఎలాంటి అనుమతులు కావాలన్నా త్వరగా ఇస్తాం. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుందని చంద్రబాబు అన్నారు. విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతి పొలంలో, ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ లాంటి విద్యుదుత్పత్తి కేంద్రాలు తీసుకొస్తాం. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. భవిష్యత్తులో వర్క్‌ఫ్రమ్ హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. 10 కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది.. సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. హాలిడే వస్తే విదేశాలకు వెళ్తున్నారు. మంచి పర్యాటక ప్రదేశాలు మన దేశంలోనే ఉన్నాయి. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు ఎపి కేబినేట్ భేటీ

## పలు కీలక అంశాలపై చర్చ

అమరావతి, **మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం కేబినెట్ భేటీ జరగనుంది. ఉదయం 10:30 గంటలకు ఏపీ సచివాలయంలో మంత్రిమండలి సమావేశం కానుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపు, చర్యలపై సీఎం, మంత్రులు ప్రత్యేకంగా చర్చించనున్నారు. అనంతరం దీనిపై అధికారులు, మంత్రులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేసే అవకాశం కనిపిస్తోంది.ఏపీలోని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అంశంపైనా మంత్రిమండలిలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. 17వ ఎస్ఐపీబీ ఆమోదించిన పలు అంశాలపైనా చర్చించి ఆమోదం తెలపనున్నారు. మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు మంత్రిమండలి ఆమోదం తెలపనుంది. సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ఎ÷–లాంట్‌కు ఆమోదం ఇవ్వనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ గ్రూప్ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేయనుంది. తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహన తయారీ పరిశ్రమకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. పలు కీలక సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి ఆమోదం తెలపనుంది.

# బదిలీపై వెళ్తున్న పోలీసులకు ఘనంగా వీడ్కోలు

## : సీఐ వేణుగోపాల్

**దేవనకొండ, మే 13( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
దేవనకొండ పోలీస్ స్టేషన్‌లో ఐదు సంవత్సరాల పాటు ప్రజలకు సేవలందించి మంచి పేరు తెచ్చుకున్న పోలీసు సిబ్బంది ఈశ్వర్ మరియు శ్రీరాములకు బదిలీ సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆత్మీయ వాతావరణంలో జరిగింది.
ఈశ్వర్‌ను బెళగల్ పోలీస్ స్టేషన్‌కు, శ్రీరాములను యెమ్మిగనూరు ప్రాంతానికి బదిలీ చేసిన నేపథ్యంలో దేవనకొండ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రత్యేకంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు.కార్యక్రమానికి పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈశ్వర్ మరియు శ్రీరాములు



విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు.దేవనకొండ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణలో వారు కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు.
గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాలు, పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలతో కలిసి పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని సీఐ తెలిపారు.ప్రజలతోస్నేహపూర్వకంగా మెలుగుతూ సేవలుఅందించడం వల్ల ఇద్దరు పోలీసు సిబ్బందిపై ప్రజల్లో ప్రత్యేక గౌరవం ఏర్పడిందన్నారు.ఈసందర్భంగా మాట్లాడిన ఈశ్వర్ మరియు శ్రీరాములు, దేవనకొండలో పనిచేసిన కాలం తమ జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోతుందని తెలిపారు.
తమకు సహకరించిన ఉన్నతాధికారులు, సీఐ వేణుగోపాల్, సహచర సిబ్బంది, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజాసేవనే లక్ష్యంగా ముందుకు సాగుతామని వారు పేర్కొన్నారు.అనంతరం సీఐ వేణుగోపాల్ చేతుల మీదుగా ఇద్దరు పోలీసు సిబ్బందికి శాలువాలు కప్పి సన్మానించారు.జ్ఞాపికలు అందజేసి భావోద్వేగ వీడ్కోలు పలికారు.కార్యక్రమం ముగింపులో సహచర పోలీసు సిబ్బంది బదిలీపై వెళ్తున్నఅధికారులతో కలిసి ఫోటోలు దిగుతూ తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

# వేంపెంట గ్రామంలో నాగార్జున రెడ్డి ప్రమాదవశాత్తు మృతి

## - 5వేలు ఆర్థిక సహాయం అందించిన టేకూరి.కుటుంబం

**పాములపాడు మే 13 రిపబ్లిక్ న్యూస్:-**
పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన జలగాని నాగార్జున రెడ్డి ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలుసుకుని, మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, 5,000/- రూపాయల ఆర్థిక సహాయం అందించారు. నాగార్జున రెడ్డి మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, ఆ కుటుంబానికి అన్ని విధాలుగా తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు.



ఈ విషయం తెలుసుకొని సింగపూర్ నుంచి వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత & అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు కూడా ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, బొమ్మ రాజేశ్, చెంచాని వేమారెడ్డి, రమేష్ రెడ్డి, సిరిపిరెడ్డి వేమా రెడ్డి, నారాయణ రెడ్డి, చిన్నస్వామి ఆచారి, సుబ్బారావు, రత్నాకర్, జీవన్న, చిన్న సుబ్బయ్య, మొగిలి శ్రీను, శేషి రెడ్డి, సురేష్, మురహరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరివేముల గ్రామంలో ఘనంగా “బడిపిలుస్తోంది” కార్యక్రమం

**దేవనకొండ, మే 13( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
దేవనకొండ మండలంలోని కరివేముల గ్రామంలోమంగళవారం ఉదయం 9 గంటలకు “బడిపిలుస్తోంది” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నమోదు పెంపు మరియు విద్యా పురోగతే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.
ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. సుధాకర్ హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల విద్యార్థులు,ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్‌ఎంలు, విద్యాశాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అలెస్కో కోఆర్డినేటర్ సురేంద్ర బాపూజీ, డీఈఓ క్యాంపు క్లర్క్ సమీర్, ఎంఈఓ-1 ఎం. ఉస్మాన్ బాషా, ఎంఈఓ-2 విజయ నిర్మలాదేవి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. సుధాకర్ స్వయంగా ర్యాలీకి నాయకత్వం




వహించి గ్రామ ప్రజలకు విద్య ప్రాముఖ్యతను వివరించారు.ప్రతి బాలబాలిక పాఠశాలలో చేరి విద్యను అభ్యసించాలని ఆయన సూచించారు. విద్యార్థులభవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సదుపాయాలను గ్రామ ప్రజలకు వివరించి, విద్యార్థులను



ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అధికారులు కోరారు.విద్యార్థుల నమోదు పెంపుతో పాటు, వారి నిరంతర విద్యాభ్యాసం మరియు విద్యా పురోగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడగా గ్రామ ప్రజలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులకు ఆశీస్సులు అందించిన రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ళ బొజ్జమ్మ



**దేవనకొండ, మే 13( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**
దేవనకొండ మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన వివాహ వేడుకల్లో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ళ బొజ్జమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వివాహ మండపాలకు చేరుకున్న ఆమెకు కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతన వధూవరులనుఆశీర్వదిస్తూ వారి దాంపత్య




జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.ప్రతి కుటుంబంలో ఆనందం, ఐక్యత, పరస్పర గౌరవం ఉండాలని ఆమెసూచించారు. సమాజంలో సంప్రదాయాలు, కుటుంబ విలువలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలనుతెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేయడం తన బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అధికారులతో కలిసి గ్రామ సమస్యలను పరిశీలించిన ఎంపీడీవో జ్యోతి

## అలారుదిన్నెలో తాగునీరు, పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక పర్యవేక్షణ

**దేవనకొండ, మే 13( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
దేవనకొండ మండలంలోని అలారుదిన్నె గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీడీవో జ్యోతి బుధవారం ప్రత్యేకంగా పరిశీలించారు. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, కాలువలు, సీసీ రోడ్లు,వీధిలైట్లు మరియు పారిశుధ్య సమస్యలపై అధికారులతో కలిసి సమగ్రంగా పర్యటించారు.గ్రామంలోని పలు వీధులను సందర్శించిన ఎంపీడీవో జ్యోతి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు సరిగా లేక మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వివరించారు.అలాగే గ్రామంలో కొన్ని సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని, రాత్రి సమయంలో వీధిలైట్లు పనిచేయక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. తాగునీటి సరఫరా కూడా సక్రమంగా లేకపోవడంతోసమస్యలుతలెత్తుతున్నాయని గ్రామ ప్రజలు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన ఎంపీడీవో జ్యోతి వెంటనే సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారంపై ఆదేశాలు జారీ చేశారు. డ్రైనేజీ






కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల మరమ్మతులు, వీధిలైట్ల ఏర్పాటు మరియు తాగునీటి సమస్యలనుత్వరితగతిన పూర్తి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగు పరచాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు.ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత



ఇస్తోందని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. ప్రజా సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో తెలుసుకొని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, గ్రామ ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు.గ్రామసమస్యలను స్వయంగా పరిశీలించి త్వరిత పరిష్కారానికి హామీ ఇవ్వడంతో గ్రామ ప్రజలు ఎంపీడీవో జ్యోతి చర్యలను అభినందించారు.

# వివాహానికి హాజరైన ఎంపీపీ, చైర్మన్, వైసిపి నాయకులు





**బేతంచెర్ల ప్రతినిధి, మే 13 (రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల పట్టణంలోని దుర్గా పేట కాలనీకీ చెందిన ఆర్టీసీ డ్రైవర్ గజ్జి మద్దయ్య& లింగమ్మ దంపతుల కుమారుడు రమేష్ & మౌనిక వీరి వివాహం కాల్వబుగ్గ దేవస్థానం టీటీడీ కళ్యాణ మండపంలో



జరిగినది. ఈ వివాహానికి హాజరైన ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, మండల సీనియర్ వైసిపి నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, వివాహానికి హాజరై నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎద్దులన్న, దుర్గా పేట నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ ముక్తేశ్వర స్వామి గ్రామోత్సవం

## భక్తి శ్రద్ధలతో మూలవిరాట్ లకు ధాన్యాధివాసం, పుష్పాదివాసం

















**బండి ఆత్మకూరు, మే 13, (రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండలం భోజనం గ్రామంలోని శ్రీ ముక్తేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు మూడోరోజు అత్యంత వైభవంగా జరిగాయి. మహోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ ముక్తిశ్వర స్వామి మూల విరాట్లకు అర్చకులు ధాన్యాదివాసం పుష్పాదివాసం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో గ్రామస్తులు తమ ఇంట్లో పండిన ధాన్యమును తెచ్చి మూల విరాట్లకు సమర్పించారు. అంతకుముందుగా తెల్లవారుజామున నవగ్రహ నక్షత్ర జపములు మూల విరాట్లకు ప్రభాత పూజ అభిషేకములు నిర్వహించారు ఆ తర్వాత మూల విరాట్ లకు మేల తాళాలు మంగళ వాయిద్యాల మధ్య అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామంలోని చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ పాల్గొని స్వామివారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామోత్సవంలో భక్తుల కాలక్షేపం కోసం నిర్వాహకులు బొల్లవరం మల్లేశ్వర రెడ్డి ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ ప్రసాద్ చైర్మన్ సగినేల శ్రీనివాసులు గ్రామ ప్రజల సహకారంతో సాంస్కృతిక





కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేశారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై జగన్మోహన్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# హెచ్.కొట్టాల సర్పంచ్ తమ్ముడు బుక్కాపురం వెంకటరాముడు మృతి

## నివాలర్పించిన మాజీ రాష్ట్ర గిడ్డంగుల షాకా వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి



**బేతంచర్ల ప్రతినిధి, మే 13 (రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల మండలం హెచ్ .కొట్టాల గ్రామం ,బుక్కపురం వెంకటరాముడు,(52) అనారోగ్యంతో బుధవారం మృతి చెండటం జరిగింధి మృతి పట్ల సంతాపం తెలిపారు. వారి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళి లర్పించారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో



వైసిపి నాయకులు బళ్లాని సూర్య, బుగ్గనిపల్లె మధు కుమార్,హెచ్ .కొట్టాల గ్రామ నాయకులు రమణ, బుక్కాపురం వెంకటరాముడు, గురుమూర్తి హరికృష్ణ శివకుమార్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# హుసేనాపురం లో దొంగల బీభత్సం



**ఓర్వకల్లు ప్రతినిధి, మే 13(రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండలము, హుస్సేనాపురం గ్రామము లోని షేక్ సలాం అను వ్యక్తి ఇంట్లో తేదీ 12.05.2026 నాడు రాత్రి ఎవరో గుర్తు తెలియని దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న బంగారు కమ్మలు, వెండి పట్టీలు, నగదు మొత్తం విలువ సుమారు 2,50000/- రూపాయలు కలవి దొంగలించుకుని పోయినారు అని షేక్ సలాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయదమైయనది. SI ఓర్వకల్ PS

# ప్రత్యేక ఆధార్ క్యాంపులు

**ఓర్వకల్లు ప్రతినిధి, మే 13(రిపబ్లిక్ న్యూస్)**



5 నుండి 15 సంవత్సరములు మరియు 15 నుండి 17 సంవత్సరముల గల విద్యార్థులు వారి యొక్క ఆధార్ కార్డు నందు బయోమెట్రిక్ అప్డేషన్ చేయించుట కొరకు ప్రభుత్వము 12వ తేదీ నుండి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతున్నది అందులో భాగంగా బుధవారం రోజు ఉయ్యాలవాడ సచివాలయం నందు ఏర్పాటుచేసిన ఆధార్ స్పెషల్ క్యాంపు ను జిల్లా స్వర్ణ గ్రామాధికారి భాస్కర్ నాయుడు ఆకస్మిక తనిఖీ చేయడం జరిగినది అలాగే సచివాలయ సిబ్బంది తో సమావేశం ఏర్పాటు చేసి అందులో ప్రజలు సచివాలయానికి వచ్చినప్పుడు వారితో మర్యాదగా మాట్లాడి వారికి అవసరమైన సేవలు పూర్తి చేయవలెనని, ×ుెూ కాల్సు ద్వారా సిబ్బంది యొక్క పనితీరు పై ప్రజలతో సమాచారం సేకరించుచున్నందున పాజిటివ్ నెస్ పెంచుకోవాలని తెలియజేయడం జరిగింది . అలాగే సచివాలయ పరిధిలో పెండింగ్లో ఈ కేవైసీ పెండెన్సీ మరియు వీదీఖ అప్డేషన్ పూర్తి చేయవలెనని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల స్వర్ణ గ్రామ అధికారి సుధీరు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ నాయక్ సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది

## జెడ్పీ సీఈఓగా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

**అనంతపురం జెడ్పీ, మే 13,(రిపబ్లిక్ న్యూస్ )**



ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ నూతన సీఈఓగా విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్లో ఉదయం 10.30 గంటలకు ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీ అధికారులు, ఉద్యోగులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కార్యాలయ సిబ్బంది ముఖ్యమైన ఫైళ్లపై ఆమెతో తొలి సంతకాలు చేయించారు. అనంతరం ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి శు భాకాంక్షలు తెలిపారు. కొత్త సీఈఓగా బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మికి జిల్లా పరిషత్ సిబ్బంది అభినందనలు తెలియజేస్తూ, పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# అభ్యుదయ భావాలతో అలరించిన కవి సమ్మేళనం



**అనంతపురం సాహిత్యం, మే 13,(రిపబ్లిక్ న్యూస్):**
కొత్త ఇంటి గోడలు కేవలం ఇటుకల సముదాయంతో మాత్రమే నిర్మితం కాకుండా నిత్యం శ్రమించే శ్రమజీవుల చెమట చుక్కలతో గది గోడలను తడిపిన అభ్యుదయ భావాలు, మంచి ఆలోచనలు పెంచడానికి అవసరమవుతాయి అని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సురేష్ అన్నారు. స్థానిక వేణుగోపాల్ నగర్ లోని జిరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిగారి వన్నప్ప నూతన గృహ ప్రవేశం సందర్భంగా తన స్వగృహంలో జిరసం నిర్వహణలో కవి సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగింది . ముఖ్యఅతిథిగా విచ్చేసిన రక్తదాతల సంఘం కన్వీనర్, ప్రముఖ హాస్య కథా రచయిత తరిమెల అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ గృహప్రవేశ వేడుకలు ఆడంబరాలకు పరిమితం చేయకుండా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వలన సమాజానికి మరింత మంచి దిశానిర్దేశం అవుతుందని, ఇల్లు కట్టడం ఒక అవసరమైతే ఆ ఇంటిలో మంచి ఆలోచనలు పెంచడం సమాజానికి ఎంత అవసరమని అన్నారు, ఈ సందర్భంగా కవులు కొత్తపల్లి సురేష్,మధుర శ్రీ, షేక్ రియాజుద్దీన్ అహ్మద్, జూటూర్ షరీఫ్,అశ్వర్థరెడ్డి, గోసల నారాయణస్వామి, తెలుగు వెలుగు టీవీ రెడ్డి, గుడిపాటి సూర్యం, తదితరులు కవిత గానంతో సమానత్వం, మానవత్వం, శ్రమజీవుల గౌరవం,సాహిత్య బాధ్యత,కుటుంబ బంధాలు, ప్రకృతి పరిరక్షణ వంటి అంశాలపై చక్కటి కవిత్వాన్ని ఆవిష్కరించారు, కవిత గానం చేసిన కవులను సత్కరిస్తూ పుస్తకాలను జ్ఞాపకాలుగా అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కోటిగారి వన్నప్పకు శాలువాతో సత్కరించి అభినందించారు కార్యక్రమంలో సహ ఉద్యోగులు,బంధుమిత్రులు, సాహిత్య ప్రియులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపురంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ట

## ధ్వజస్వంభంపై మేఖలాలు పునఃప్రతిష్ఠ





**మహానంది, మే 13, (రిపబ్లిక్ న్యూస్)** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో వైభవంగా నూతన ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ట,ధ్వజస్వంభంపై మేఖలాలు పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. శివ కోదండ రామాలయంలో 3 వరోజు బుధవారం పూజా కార్యక్రమాలలో భాగంగా రుత్వికులు రామ్మూర్తి శర్మ, రామశర్మ, భోగేంద్ర శయన్ శర్మ, సుబ్రహ్మణ్యం శర్మ ఈశ్వర



స్వామివారికి,యంత్రానికి అభిషేకార్చనలు, యంత్ర ప్రతిష్ఠ,విగ్రహ ప్రతిష్ఠ,మేఖలాల ప్రతిష్ఠ,కూష్మాండ బలి, హారతి, కలశ మార్జినం నిర్వహించారు. గ్రామ ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఎర్రగుంట్ల హరిబాబు,కళావతి దంపతులు, పోలిశెట్టి సురేంద్ర,భూలక్ష్మి దంపతులు, కదిరి సాయి , దివ్య దంపతులు, ఉల్లి మధు, మధుమణి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

# పొల్యూషన్ తోని నష్టపోతున్న కనమడకల రైతులను తక్షణమే కాపాడాలి

**పొల్యూషన్ ను అదేవిధంగా కొనసాగిస్తే ప్రభుత్వము వెంటనే చర్యలు తీసుకుని ధరణి మినరల్స్ పరిశ్రమను మూసివేయాలి**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్**

**ఓర్వకల్లు ప్రతినిధి, మే 13(రిపబ్లిక్ న్యూస్)**
బుధవారం రోజున ఓర్వకల్లు మండలంలోని కనమడకల గ్రామా సమీపంలో కేతవరం పొలిమేర సర్వేనెంబర్ 288 లో ధరణి మినరల్స్ పరిశ్రమ దగ్గర ధర్నా చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ షాజహాన్ జి శ్రీధర్ రైతు సంఘం మండల అధ్యక్షులు మధుసూదన్ పాల్గొన్నారు అనంతరం జి రామకృష్ణ మాట్లాడుతూ కనమడకల గ్రామానికి దగ్గరగా ఉన్న ధరణి మినరల్ పరిశ్రమ నుండి వచ్చే పొల్యూషన్ పక్కనే ఉన్నటువంటి పొలాల మీద పడటంతో పంటలు రాక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కావున నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు అలాగే ప్రజాభిప్రాయ సేకరణ జరిగినప్పుడు కేతవరం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని రహదారి చుట్టూ పచ్చదనం పర్యావరణం అలాగే ఏపీ టూరిజం డెవలప్ చేస్తామని చెప్పారు కానీ ఇంతవరకు ఏ ఒక్క




హామీ కూడా నెరవేరలేదు మేము చిన్న చిన్న పరిశ్రమలకు అభివృద్ధికి ఆటంకం కాదని వారు చెప్పారు అలాగే అక్కడ నివసించేటటువంటి గ్రామ ప్రజలు రైతుల పొలాలకు ఎటువంటి హాని జరగకుండా చూసుకునే బాధ్యత కూడా పరిశ్రమ యజమానిపై ఉన్నది అని వారన్నారు కావున ఇప్పటికైనా పొలాల మీద పొల్యూషన్ పడకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు లేనిపక్షంలో ప్రజలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు బసిర్ గ్రామ ప్రజలు శ్రీనివాసులు సుబ్బరాయుడు రమేషు శాలు భాష శ్రీను తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య

## : డీఈవో జనార్ధన్ రెడ్డి

**మహానంది, మే 13, (రిపబ్లిక్ న్యూస్):-**
ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య కొనసాగుతోందని డీఈవో జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి,వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని డీఈవో జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మహానంది మండలం అబ్బీపురం , పుట్టుపల్లి గ్రామాల్లో ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు మరియు పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ బడులలో లభిస్తున్న ఉన్నత ప్రమాణాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులకు సూచించారు. తిమ్మాపురం పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తన






వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని, ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయులుగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు (నేటి ఉపాధ్యాయులు) తమ గ్రామ పాఠశాల అభివృద్ధిపై డీఈవో చూపిస్తున్న చొరవను అభినందించారు. జిల్లా విద్యా రంగాన్ని అగ్రపథాన నడిపిస్తున్న జనార్ధన్ రెడ్డి గారిని వారు ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డితో పాటు , ఉపాధ్యాయులు దేవనాల శ్రీనివాసులు,పిట్టల శ్రీనివాసులు,కల్లెమద్దిలేటి,గణి శ్రీనివాసులు,జనార్ధన్. చక్రధర్,హుశ్శేన్ భాష మరియు, సీఆర్పి తిమ్మయ్య,గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు తిమ్మయ్య,కుంపటి రమణయ్య,బోయ భాస్కర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మరియు విద్యా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులే నేరుగా గ్రామానికి వచ్చి విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

**గుత్తి మే 13 (రిపబ్లిక్ న్యూస్ )**
గుత్తి పట్టణంలో మట్కా నిర్వహిస్తూ గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 3 లక్షల నగదు, 34 మట్కా చీటీలు, 3 బాల్ పెన్నులు, 1,100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రజలకు డబ్బుల ఆశ చూపిస్తూ మట్కా ఆడిస్తూ, గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్నారనే ఖచ్చితమైన సమాచారం మేరకు గుత్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. రామారావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం గుత్తిఅనంతపురం రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో



ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.
అరెస్టు అయినవారిలో గుత్తి పట్టణానికి చెందిన మాతంగి రాము (44), మునగల కంబగిరి (39), నగదాని శివ (38) ఉన్నారు. వీరిపై గుత్తి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 104/2026 కింద NDPS చట్టం మరియు ఏపీ గేమింగ్




మట్కా చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.
గుత్తి సీఐ ఎం. రామారావు, ఎస్ఐ కె. సురేష్, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారుల సంయుక్త బృందం ఈ దాడులు నిర్వహించింది.
ఈ కేసులో మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# గ్రామాలకుమహిళలఉచిత బస్సులు నడపాలి

## బి కే ఎం యు డిమాండ్.

**ఓబులవారిపల్లి మే 13 రిపబ్లిక్ న్యూస్.**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం మంచి పథకం అని ఈ పథకం లో భాగంగా ఉచిత బస్సు లను గ్రామాలకు నడపాలని బికేఎంయు రైల్వేకోడూరు కార్యదర్శి జయరామయ్య డిమాండ్ చేశారు,ఓబులవారిపల్లి మండలం లోని వై కోట, చెన్నరాజుపాడు, బాల్రెడ్డిపల్లి, ఓబులవారిపల్లి నూకనపల్లె గ్రామాలకు ఏపీఎస్ఆర్టీసీ మహిళల ఉచిత బస్సు సౌకర్యాన్ని ఈ గ్రామీణ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతముగా ఉండేందుకు ఈ గ్రామాలకు బస్సులు నడపాలని కోరారు,
కూటమి ప్రభుత్వం ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమం మంచి పథకం అని గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ పథకం పట్ల మంచి ఆకర్షితులు అవుతున్నారని గ్రామీణ ప్రాంతాలకు



పొడిగించడం వల్ల కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆయన తెలిపారు, అలాగే ఓబులవారిపల్లి మండలం వై కోట గ్రామంలో సుమారు 2000 కుటుంబాలు 5600 మంది జనాభా ఉన్నారు,అలాంటి గ్రామానికీ ఆర్టీసీ యాజమాన్యం బస్సు నడపాలని ఈ విషయమై చిత్తశుద్ధితో ఉచిత బస్సు సౌకర్యం ఈ గ్రామాలకు నడిపేందుకు ఆర్టీసీ ముందుకు రావాలని కోరుతున్నా మన్నారు, నిత్యం వై కోట ప్రాంతం నుంచి విద్యార్థులు, పేదలు,వ్యవసాయ కూలీలు, బడుగు బలహీన వర్గాల వాళ్ళు ప్రతి రోజు కోడూరు కి వెళ్లి వస్తుంటారని సరైన బస్సు సౌకర్యం లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుకుంటున్నామన్నారు, ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలియజేశారు వైకోట ప్రాంతానికి వెళ్లే దారుల్లో చాలాగ్రామాలు ఉన్నాయని అనంతరాజుపేట రామయ్య పాలెం నారాయణ రాజు చలం పాలెం వెంగళరాజు పోడు కండ్రిక సున్నపురాళ్లపల్లె అద్దిపల్లి గ్రామాల వారి కి కూడా ఈ బస్సు కనెక్టివిటీ ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలియజేశారు అలా జరగని పక్షంలో వైకోట బాల్రెడ్డిపల్లి గాదెల గ్రామం మహిళలతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోడూరు బస్టాండు దగ్గర నిరసన తెలియజేస్తామని బి కే యం యు హెచ్చరిస్తున్నామన్నారు.

# రంగాపురం గూటుపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ కట్

**- విద్యుత్ ఏ డి ఈ మధుసూద న్ రెడ్డి - రూరల్ ఏఈ శ్రీనివాసులు**





**బేతంచెర్ల ప్రతినిధి,మే 13 (రిపబ్లిక్ న్యూస్)**
బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం మరియు గూటుపల్లె సబ్ స్టేషన్ పరిధి లోని గ్రామాలకు నేడు గురువారం పవర్ సప్లై నిలిపివేయడం జరుగుతుందని ఏ డి ఈ మధు సుదన్ రెడ్డి మరియు రూరల్ ఏ ఈ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటన లో తెలిపారు. వారు మాట్లాడు తూ.విద్యుత్ స్తంభాల మరమ్మత్తుల కారణంగా నేడు ఉదయం 10 గంటల నుండి 12 వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందిని వారు తెలిపారు. అంతేకాకుడా రైతులకు ఇచ్చే కరెంట్ ఉదయం ముందుగానే 6 గంటల నుండి 10 వరకు ఇస్తున్నామని, మిగతా వి ద్యుత్ 12 గంటల నుండి 5 వరకు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. కాబట్టి రైతులు, యజ మానులు, ప్రజలు సహకరించాల్సిందిగా వారు కోరుకోరారు.

# ఎస్ వి జూనియర్ కళాశాల ప్రారంభం



**గుత్తి మే 13 (రిపబ్లిక్ న్యూస్)**గుత్తి పట్టణంలోని బుధవారం ఎస్ వి జూనియర్ కళాశాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొన్నారు ముందుగా కళాశాల ప్రిన్సిపల్ ఘన స్వాగతం పలికారు అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్ది మంచి మార్గంలో పెట్టాలంటే ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి మండల అధ్యక్షుడు లక్ష్మి రంగయ్య రమేష్ రామకృష్ణ సోమశేఖర్ కేశవ నాయుడు రసూల్ ప్రసాద్ టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నూతన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం




**గుత్తి మే 13( రిపబ్లిక్ న్యూస్)** గుత్తి పట్టణంలోని గుత్తి ఆర్ఎస్‌లో భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు, కొనకొండ్ల రాజేష్ జిల్లా రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి పాల్గొని కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులను పార్టీ జిల్లా నాయకత్వం అభినందించింది. గుత్తి మండల బీజేవైఎం అధ్యక్షుడిగా కే.వసంత్ కుమార్‌ను, ఉపాధ్యక్షుడిగా కే .చిరంజీవి ని అధికారికంగా నియమిస్తూ పార్టీ నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి శు భాకాంక్షలు తెలిపారు.పార్టీ నాయకులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అలాగే ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా 30 కుటుంబాలు , యువకులు, కార్యకర్తలు భారతీయ జనతా పార్టీలో చేరారు. వారికి జిల్లా నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై ప్రజాసేవలో భాగస్వామ్యం కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గుత్తి మండల అధ్యక్షులు పాలమూరు చంద్రశేఖర్ పట్టణ అధ్యక్షుడు బీసీ వెంకప్ప ప్రధాన కార్యదర్శులు చామంతుల ప్రేమ్ కుమార్ నూరల్ హసన్ భాష పట్టణ ఉపాధ్యక్షుడు వై రాజశేఖర్ రెడ్డి కిసాన్ మోర్చా రాయలసీమ ఇన్చార్జ్ తిమ్మా రెడ్డి స్టేట్ కౌన్సిలర్ నెంబర్ రంగరాజు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఓబులయ్య జిల్లా కార్యదర్శిలు బాల్క నారాయణ రెడ్డి కవితా శర్మ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రెడ్డి మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కరీం మాజీ పట్టణ అధ్యక్షులు మూలింటి బాలకృష్ణ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు హేమలత మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఇటికల వలి ఎస్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ మండల అధ్యక్షుడు సురేష్ ఉపాధ్యక్షుడు ఓం ప్రకాష్ యాదవ్ బీజేవైఎం జిల్లా పదాధికారులు వివిధ మండలాల నుంచి విచ్చేసిన పదాధికారులు పవన్ భారతీయ జనతా పార్టీ బీజేవైఎం అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల కసరత్తు.. సెప్టెంబర్‌లో నోటిఫికేషన్!

**మే 13( రిపబ్లిక్ న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సన్నాహాలు ప్రారంభించింది. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగియనుండటంతో, సెప్టెంబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, డిసెంబర్ నాటికి మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త ఏడాదికి నూతన పాలకవర్గాలు కొలువుదీరేలా చర్యలు చేపడుతోంది.ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిన్న అమరావతిలో కీలక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు ఈ భేటీలో పాల్గొన్నారు. ఎన్నికల ఏర్పాట్లు, వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాల్లో వార్డులు, డివిజన్ల పునర్విభజన ప్రక్రియ కొనసాగుతోందని, ఇది జూన్ 26 నాటికి పూర్తికానుందని అధికారులు తెలిపారు. మరోవైపు, బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ తన నివేదికను జూన్‌లో ప్రభుత్వానికి అందించే అవకాశం ఉంది.

# బంగారు తల్లులూ..భవిష్యత్తు మీదే

**ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ శివజ్యోతి**
**బాలసదనం సందర్శించిన జేడీ**
**అక్కడి చిన్నారులతో మాటామంతి**
**వారిలోని ప్రతిభను గుర్తించి అభినందించిన శివజ్యోతి**
**చిల్డ్రన్ హోం నిర్వాహకురాలు రఫీ మున్నీసా, సిబ్బందికి ప్రత్యేక ప్రశంసలు**



**అనంతపురం సంక్షేమం, మే 13,(రిపబ్లిక్ న్యూస్):**
'మేమూ మీ వయస్సులో ఉన్నప్పుడు ఎన్నో ఒడిదుడుకులు చూశాం. ఇప్పుడున్న సౌకర్యాలు, వసతులు, అవకాశాలు అప్పుడు లేవు. అయినా పట్టుదలతో చదివాం. ఇప్పుడు ఈ స్థాయిలో ఇలా మీ ముందుకు వచ్చాం. మీరు వచ్చిన నేపథ్యం ఏదైనా గానీ వాటిని మనస్సులో నుంచి పూర్తిగా తుడిచేయండి. ఇప్పటి నుంచే మీకంటూ ఒక లక్ష్యం ఏర్పరచుకోండి. వాటిని సాకారం చేసుకునే దిశగా ఆలోచించండి. అడుగులు వేయండి. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి. కసితో చదవండి. మీరనుకున్న లక్ష్యం నెరవేర్చుకుంటారు. అప్పటికి మేమంతా రిటైర్డ్ అయి ఇళ్లల్లో ఉంటాం. భవిష్యత్ అంతా మీదే. మాలాగా మంచి హోదాల్లో మీరు కూడా స్థిరపడాలి. పది మందికి ఉపయోగపడాలి' అంటూ ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్(జేడీ) శివజ్యోతి అన్నారు. అనంతపురం బుడ్డప్పనగర్ లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంను పీడీ శశికళతో కలసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండ్రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన జేడీ.. బాలసదనాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న అనాథ పిల్లలు తమ చిట్టి చేతులతో రూపొందించిన కలర్ పేపర్ల బొకేను అందించి స్వాగతం పలికారు. వాటిని ఎలా తయారు చేశారు, ఎవరు చేశారంటూ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. మీరొస్తున్నారని.. మేమే చేశాం మేడం అంటూ చిన్నారుల సమాధానంతో ఆమె ఆశ్చర్యపోయారు. ఇంత అందంగా తయారు చేయడం చూస్తుంటే మీలో చాలా ప్రతిభ దాగుందని, ఇంత చక్కటి ఆలోచన ఎలా వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. మా సూపరింటెండెంట్ రఫీమున్నీసా ఆధ్వర్యంలో సిబ్బంది నేర్పించారంటూ చిన్నారులు బదులివ్వడంతో ఆమె వారిని కూడా అభినందించారు. మార్కెట్లో తయారు చేసే పుష్పగుచ్ఛాలకు ఏమాత్రం తీసిపోకుండా వాటికంటే అందంగా తయారు చేయడం తనకు బాగా నచ్చిందని, వీటిని నేను తీసుకెళ్లనా అంటూ అడిగి మరీ వెంట తీసుకెళ్లారు. చిన్నారుల క్రమశిక్షణ చూస్తుంటే ముచ్చటేస్తోందని, చదువులో కూడా ఇటువంటి చొరవ చూపి భవిష్యత్లో మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. తరువాత కార్యాలయం గది, ఇతర గదులతో పాటు డార్మెటరీ, వంట గది.. ఇలా అన్ని గదులను ఆమె పరిశీలించారు. ఇక్కడి వాతావరణం తనను బాగా ఆకర్షించిందని, మనస్సుకు హాయిగా ఉందని పేర్కొన్నారు. అక్కడి నుంచి శిశుగృహను సందర్శించారు. కార్యక్రమంలో గుంటూరు నుంచి వచ్చిన సీడీపీఓ సునీత, డీసీపీఓ మంజునాథ్, బాలసదనం సూపరింటెండెంట్ ఖాజీ రఫీమున్నీసా, అకౌంటెంట్ ఫాతిమా, సిబ్బంది అమీన, మాధవి పాల్గొన్నారు.

# అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్

**23 నెలల్లో రూ.3.61 లక్షల కోట్ల అప్పు**
**సీఎం కు క్రెడిట్ కార్డులా మారిన అమరావతి**
**జగన్ హయాంలో అమలైన పథకాలూ అటకెక్కిన వైనం**
**నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి అమలు ఎప్పుడు**
**వెనుకబడిన జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పాలి**
**ఎండిపోతున్న పంటలకు రక్షకతడులు అందించి రైతుల్ని ఆదుకోండి**
**వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి**




**అనంతపురం ప్రతినిధి, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు.
ఈ సందర్భంగా రికార్డు స్థాయిలో 23 నెలల్లోనే రూ.3.61 లక్షల కోట్లు అప్పు చేశారని.. ఆ డబ్బు ఎక్కడ ఖర్చు చేశారో ప్రజలకు తెలియజేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురంలోని హెచ్ఎల్సీ కాలనీలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో రూ.3.32 లక్షల కోట్లు అప్పు చేస్తే రూ.10 లక్షలు చేశారంటూ దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, డీబీటీ ద్వారానే రూ.2.73 లక్షల కోట్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. నాన్ డీబీటీతో కలుపుకుంటే రూ.4.58 కోట్లు ప్రజలకు లబ్ధి కలిగిందన్నారు. కానీ చంద్రబాబు సీఎం అయ్యాక 23 నెలల్లోనే రూ.3.61 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పి.. ఇప్పుడు గత ప్రభుత్వంలో అమలైన పథకాలను కూడా నిలిపివేశారన్నారు.

### ఇచ్చిన హామీలను అమలులో ప్రభుత్వం విఫలం

సూపర్ సిక్స్‌లోని నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని కూడా అమలు చేయలేదన్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ వ్యవస్థ పూర్తిగా నీరుగారిపోయిందని, నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్పుగా తెచ్చిన డబ్బులన్నీ ఎక్కడికి వెళ్తున్నాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా ప్రజా సమస్యలను పరిష్కరించడం కంటే వైసీపీని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పోలీసు శాఖను అడ్డుపెట్టుకొని పరిపాలన సాగిస్తోందని, ప్రజా సమస్యలు బయటకు రాకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా జిల్లాలో రైతాంగ సమస్యలపై ప్రజాప్రతినిధులు కనీస సమీక్ష కూడా నిర్వహించడం లేదన్నారు. హంద్రీనీవా కాలువను 11 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరించాలని కోరారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 780 అడుగుల నుంచే రోజుకు 7 టీఎంసీలకు తెలంగాణ తీసుకెళ్తోందన్నారు. 11 వేల క్యూసెక్కులతో హంద్రీనీవాను విస్తరిస్తే 40 రోజుల్లో 40 టీఎంసీలను తీసుకెళ్లే అవకాశం ఉంటుందన్నారు. 2012 నుంచి కృష్ణా జలాలు వస్తున్నా ఆయకట్టుకు నీరందించలేని పరిస్థితి ఉందన్నారు. తక్షణం ఆయకట్టును స్థిరీకరించి 3.50 లక్షల ఎకరాలకు నీరందించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, జిల్లా కేంద్రమైన అనంతపురంలోనే శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. అమరావతి చంద్రబాబుకు క్రెడిట్ కార్డుగా మారిందని విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు తాత్కాలిక సచివాలయం, హైకోర్టు పేరుతో నిధులు దోపిడీ చేశారని, ఇప్పుడు కూడా అమరావతిలో అభివృద్ధి పేరుతో దోపిడీ కొనసాగుతోందన్నారు. అమరావతి మాత్రమే కాకుండా వెనుకబడిన ప్రాంతాల వైపు కూడా చూడాలని సూచించారు. అనంతపురం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎండిపోతున్న పంటలకు రక్షకతడులు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 70 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఆ కుటుంబాలకు రూ.7 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరారు.

### కేంద్ర నిధులు వెనక్కి వెళ్లకుండా చూడండి

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అనంతపురం నగరంలో కేంద్ర ప్రభుత్వ సహకారం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రూ.310 కోట్లతో పంగల్ రోడ్డు నుంచి బళ్లారి బైపాస్ వరకు నాలుగు లైన్ల విస్తరణ చేపట్టినట్లు అనంత వెంకటామిరెడ్డి తెలిపారు. బ్రిడ్జి, రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు. కొన్ని చోట్ల భూసేకరణకు సంబంధించి మొదట్లో కేంద్రం నిధులు ఇవ్వకపోవడంతో ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి గడ్కరీ, ఇతర అధికారులను కలిసి ఒప్పించామని తెలిపారు. ఇందులో భాగంగా టవర్ క్లాక్ వద్ద సర్వీస్ రోడ్డు, సప్తగిరి సర్కిల్ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.40 కోట్లు మంజూరు చేయించుకొచ్చినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందే టవర్ క్లాక్ వద్ద సర్వీస్ రోడ్డు పూర్తి చేశామని గుర్తు చేశారు. అయితే ఎన్నికల తర్వాత సప్తగిరి సర్కిల్ అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. రెండేళ్లయినా పట్టించుకునే వారు లేరన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం మంజూరు చేసిన నిధులు వెనక్కువెళ్లిపోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఈ విషయంపై గతంలోనే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎన్‌హెచ్ అధికారులుతో తాను మాట్లాడినట్లు చెప్పారు. పనులు చేపట్టి నిధులు వెనక్కి వెళ్లిపోకుండా చూస్తామని అధికారులు చెప్పినా ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేదని తెలిపారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు చొరవ తీసుకుని ఉన్న నిధులు వినియోగించి అభివృద్ధి పనులు చేయాలని కోరారు.

# ఎన్‌టిఏ వైఫల్యంతో విద్యార్ధులకు శాపం !

**మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఏను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు






చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఏ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పిచడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)-2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది. ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

## ఇంటర్ పరీక్ష రాసిని మాజీ మావోయిస్ట్ దేవ్‌జీ

**జగిత్యాల, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఇంటర్ పరీక్షకు హాజరయ్యారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆయన ఈ పరీక్ష రాశారు. 1980-82లో దేవ్‌జీ కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివారు. విద్యార్థి రాడికల్ యూనియన్‌లో పనిచేస్తున్న సమయంలో సెకండియర్ తెలుగు పరీక్షను ఆయన బహిష్కరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన ఆయన.. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో పరీక్ష



రాశారు. బుధవారం కోరుట్లలోని మ్యాస్ట్రో జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్ష రాశారు. న్యాయవాద కోర్సు చేసి పేదల కోసం పనిచేస్తానని దేవ్‌జీ చెప్పారు.

-------

## దోపిడీ నేపాలీ ముఠా కోసం గాలింపు

హైదరాబాద్, **మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ ఠాణా పరిధిలో నేపాలీ దోపిడీ దొంగలు రెచ్చిపోయిన ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్(68), భార్య డాక్టర్ విజయలక్ష్మి(58)ని బంధించి 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో నిందితులు పరారైన విషయం తెలిసిందే. దోపిడీలో 8 మంది సభ్యుల నేపాలీ ముఠా పాల్గొన్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వృద్ధ దంపతులను ఇంట్లో బంధించిన తర్వాత నిందితులు ఆటో బుక్ చేసుకుని అక్కడి నుంచి వెళ్లి పోయిన సీసీ టీవీ ఫుటేజ్‌ని పోలీసులు సేకరించారు. ఘటన తర్వాత ప్రొఫెసర్ ఇంట్లోని హార్డ్ డిస్క్‌లు, సీసీ కెమెరాలను నిందితులు ధ్వంసం చేసినట్టు పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఘటనాస్థలిని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. నిందితులంతా ఇప్పటికే నేపాల్ చేరుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

## కస్టోడియల్ టార్చర్ కేసు

### జగన్‌ను వదిలే ప్రసక్తి లేదు -డిప్యూటి స్పీకర్ రఘురామ



**భీమవరం,, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**వైసీపీ హయాంలో తనపై నమోదైన కస్టోడియల్ టార్చర్ కేసును వదిలే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. ఈ కేసుపై తాను పట్టువదలని విక్రమార్కుడిలా న్యాయం కోసం ప్రయత్నిస్తున్నానని వ్యాఖ్యానించారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో రఘురామ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం తన పుట్టినరోజు అని.. తన కేసు రేపటికి ఐదేళ్లు అవుతుందని తెలిపారు. తన కేసులో మూడో ముద్దాయిగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని ప్రస్తావించారు. మొదటి ముద్దాయి విచారణకు రాయల్‌గా వచ్చి రాయల్‌గా వెళ్లిపోయారని రఘురామ విమర్శించారు. రెండో ముద్దాయిని, మూడో ముద్దాయిని ఇంకా విచారణకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఈ కేసులో జగన్ రెడ్డి, సునీల్ కుమార్ పేర్లు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం పనులను శరవేగంగా పూర్తి చేస్తోందని తెలిపారు. 2027 జూన్‌లో పోలవరం పూర్తి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని అన్నారు. పోలవరంతో పాటు తన కస్టోడియల్ టార్చర్ కేసును కూడా పూర్తి చేస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పుకొచ్చారు. తనపై మహాసేన రాజేశ్ పెట్టిన పోస్టును చూశానని తెలిపారు. జగన్ రెడ్డిని ఇప్పటివరకు తాను ఎందుకు ప్రశ్నించలేదని రాజేశ్ అడిగారని చెప్పారు. ఈ విషయంపై ఆయనతో మాట్లాడతానని అన్నారు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే ఆయన చేసిన దారుణాల గురించి తాను మాట్లాడానని చెప్పుకొచ్చారు. రచ్చబండ ద్వారా జగన్ రెడ్డిని ఓడించే వరకు మాట్లాడానని తెలిపారు. ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయారని విమర్శించారు. ఇంకా జగన్ గురించి తాను మాట్లాడేది ఏముందని రఘురామ ప్రశ్నించారు.

## రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో యూటర్న్

### విమర్శలు రావడంతో నియామకాన్ని రద్దు చేస్తే ఉత్తర్వులు

**చెన్నై,, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):**
జ్యోతిష్యుడు రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో తమిళనాడు సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. ఆయనను తన ఓఎస్‌డీగా నియమిస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఒక జ్యోతిష్యుడిని ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమించడం ఏమిటని ప్రతిపక్షాలు, మిత్రపక్షాల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. వెట్రివేల్‌కు గతంలో ఇచ్చిన నియామక ఉత్తర్వులను రద్దు చేసినట్టు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో సీఎం విజయ్ నెగ్గిన విషయం తెలిసిందే. అయితే, విశ్వాస పరీక్షకు ముందు వీసీకే ఎమ్మెల్యే వాణి అర్సు ఓఎస్‌డీ అంశాన్ని లేవనెత్తారు. శాస్త్రీయత, తార్కిక ఆలోచనా ధోరణితో ముందుకు సాగాలని అన్నారు.



మూఢనమ్మకాలను పక్కనపెట్టాలని చెప్పారు. 'మన ప్రభుత్వం జ్యోతిష్యానికి కాక శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యం ఇవ్వాలి' అని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రాధన్ నియామక ఉత్తర్వులను ఉపసంహరించుకున్నామని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ దగ్గర విజయ్ జ్యోతిష సలహాలు తీసుకుంటుంటారు. ఎన్నికలకు ముందే ఆయన టీవీకే విజయాన్ని ఊహించారు. జయలలిత సహా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులకు కూడా ఆయన సలహాలు ఇచ్చేవారు. మంగళవారం ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా వెట్రివేల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే దీనిపై అన్ని పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ విమర్శలపై విజయ్ స్పందిస్తూ.. ఆ నియామకాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఓఎస్డీ బాధ్యతల నుంచి వెట్రివేల్‌ను తప్పిస్తూ విజయ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బలపరీక్ష అనంతరం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## కళ్లాల సౌకర్యం లేక రైతులకు నష్టం

### అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్న ధాన్యం -తక్కువ ధరలకు దళారులకు అమ్ముకునే దుస్థితి

**కాకినాడ,, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):** ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు కళ్లాల సౌకర్యం లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంబడి కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. 17 శాతం తేమ ఉండాలనే రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. సుమారు నాలుగు రోజుల పాటు ఎండలో ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది. ఇటీవల రెండుసార్లు కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. దీంతో, పచ్చి ధాన్యాన్ని దళారులకే తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల సాధారణ రకానికి రూ.1,725, 'ఎ' గ్రేడ్ రకానికి రూ.1,740 మద్దతు ధర ఇవ్వాలి. దళారులు కొన్ని ప్రాంతాల్లో 1250 నుంచి రూ.1300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.1,400 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో, బస్తాపై రైతులు రూ.300 నుంచి రూ.400 వరకూ నష్టపోయారు. దళారికి 75 కిలోల బస్తా రూ.1,400కు అమ్ముకోవాల్సి వచ్చిందని వాపోయారు. 70 శాతం మంది ఈ విధంగానే ధాన్యాన్ని అమ్ముకున్నారని తెలిపారు. ప్రభుత్వం



సకాలంలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదు. తేమ శాతం నిబంధన వంటి కారణాల వల్ల వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల బస్తాను రూ.1,400 కే ఇచ్చేయాల్సి వచ్చిందని వాపోయారు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. దీంతో, మద్దతు ధర లభించక అన్నదాతలు నష్టపోతున్నారు. కాకినాడ జిల్లాలో ఇప్పటికే 90 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఇందులో ప్రభుత్వం కొన్నది 1.30 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఈ ఏడాది రబీలో ఎకరాకు సుమారు 45 బస్తాల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తున్న ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరిస్తుండడం, మేఘాలు, వర్షాలు భయపెడుతుండడంతో రైతులు గత్యంతరంలేని పరిస్థితుల్లో దళారులను తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది రబీ సీజన్లో కాకినాడ జిల్లాలో 1.87 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 6.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకూ 1.65 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఇందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల (21.67 శాతం) ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యం కళ్లాల్లోనే ఉంది. వాతావరణ పరిస్థితులు భయపెడుతున్న నేపథ్యంలో వరి కోత, నూర్పిడి పనులను 95 శాతం మేర యంత్రాల ద్వారానే పూర్తి చేస్తున్నారు.

## ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం : పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత

**న్యూఢిల్లీ,, మే13, ( రిపబ్లిక్ న్యూస్ ):** ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో విమానాలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేసింది. ఢిల్లీ-చికాగో, ముంబై-న్యూయార్క్, ఢిల్లీ-షాంఘై, చెన్నై-సింగపూర్, ముంబై-ఢాకా, ఢిల్లీ-మాలే రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం జూన్ నుంచి




ఆగస్టు మధ్యకాలంలో అమలులో ఉంటుందని తెలిపింది.
నష్టాల దృష్ట్యా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వీసులను ఎయిర్ ఇండియా తగ్గించింది. ఆ నిర్ణయాన్ని మరికొన్ని రూట్లకు విస్తరిస్తూ తాజాగా ప్రకటన జారీ చేసింది. దీని ప్రకారం ఎయిర్ ఇండియా సంస్థ ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపనుంది. వీటిలో ఉత్తర అమెరికాకు వారానికి 33, ఐరోపాకు 47, యూకేకు 57, ఆస్ట్రేలియాకు 8, ఫార్ ఈస్ట్, ఆగ్నేయాసియా, సార్క్ ప్రాంతాలకు 158 విమానాల చొప్పున నడవనున్నాయి. అలాగే మారిషస్‌కు వారానికి ఏడు విమాన సర్వీసులు ఉన్నట్లు పేర్కొంది. కాగా, నష్టాల దృష్ట్యానే ఎయిర్ ఇండియా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రజా రిపబ్లిక్



### ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కు

# నట్టికుమార్ రాజీనామా..

### కౌన్సిల్ తీరుపై విమర్శలు



తెలంగాణ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ పదవికి నిర్మాత నట్టి కుమార్ రాజీనామా చేశారు. కేవలం పదవిని వదులుకోవడమే కాకుండా, కౌన్సిల్ పనితీరులోని లోపాలను ఎత్తిచూపుతూ లేఖ రాశారు. నట్టి కుమార్ తన రాజీనామా లేఖలో కౌన్సిల్ నిర్వహణపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ముఖ్యంగా నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య ఉండాల్సిన పర్సంటేజీ విధానం అమలులో కౌన్సిల్ పూర్తిగా విఫలమైందని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల చిన్న, మధ్యతరగతి నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఎగ్జిబిటర్ల ఆధిపత్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సిల్ నిర్ణయాల్లో పారదర్శకత లేదని, కార్యవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగడం లేదని... ఆడిటింగ్, ఆర్థిక నిర్వహణలో జవాబుదారీతనం లోపించిందని నట్టి కుమార్ లేఖలో వెల్లడించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా తాను ఏమీ చేయలేనప్పుడు ఆ పదవిలో కొనసాగడం అర్థరహితమని ఆయన పేర్కొన్నారు. తన రాజీనామా తర్వాతైనా సభ్యులందరూ మేల్కొని, సంస్థను పారదర్శకంగా నడిపించాలని ఆయన కోరారు.


## అవతార్-3... ఓటీటీ స్ట్రీమింగ్ కు రెడీ!



జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అవతార్-3 ఫైర్ అండ్ యాష్ గత ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమా త్వరలో అంతర్జాతీయ ఓటీటీలోకి రానుంది. డిస్నీప్లస్ వేదికగా జూన్ 24వ తేదీన ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుందని వెల్లడిస్తూ, నిర్మాణ సంస్థ పోస్టర్‌ను విడుదల చేసింది.అవతార్-3 చిత్రం థియేటర్లలో మంచి వసూళ్లను రాబట్టింది. వాస్తవానికి ఈ చిత్రం ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో రెంటల్ ప్రాతిపదికన అందుబాటులో ఉంది.

జూన్ 24వ తేదీ నుంచి సబ్‌స్క్రిప్షన్ ఉన్న వినియోగదారులకు ఎలాంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా సినిమాను వీక్షించవచ్చు.

అవతార్-3 భారతదేశంలో జూన్ 24వ తేదీనే జియో హాట్‌స్టార్‌లో అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. తెలుగు, హిందీ, తమిళం తదితర భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. భారతదేశంలో ఈ సినిమా ఓటీటీ విడుదలపై ప్రకటన రావాల్సి ఉంది.



### నోరా కిల్లింగ్ లుక్

## : కాసులు, నాణేలతో ఒళ్లంతా సింగారం

గ్లోబల్ డాన్సింగ్ సెన్సేషన్ నోరా ఫతేహి తన సరికొత్త ఫోటోషూట్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. “నీ ఒళ్లు బంగారం కాను..!“ అనేలా మెరిసిపోతున్న ఆ దివ్యమైన రూపం అభిమానుల కళ్లను తిప్పుకోనివ్వడం లేదు. భారతీయ సంప్రదాయ ఆభరణాలు... ఉత్తర ఆఫ్రికా సంస్కృతుల అరుదైన కలయికతో రూపొందించిన ఈ లుక్ నోరా కెరీర్‌లోనే అత్యంత ప్రయోగాత్మకమైన.. అందమైన ఫోటోషూట్‌లలో ఒకటిగా నిలుస్తోంది. ఈ ఫోటోషూట్ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం ఒక -జల దేవత- రూపానికి ప్రాణం పోయడం. ఇందులో భాగంగా నోరా శరీరం నిండా బంగారు కాసులు, నాణేలతో కూడిన ఆభరణాల దుస్తులను డిజైన్ చేయించడం ఆసక్తిని కలిగించింది. ఈ గోల్డ్ జ్యువెలరీ ఈ బ్యూటీకి ఒక రాజసం ఉట్టిపడే భారతీయ సౌందర్యాన్ని అందించింది. నోరా నిజంగా ఒక దేవతలా వెలిగిపోతోంది. కేవలం భారతీయతకే పరిమితం కాకుండా.. ఈ లుక్‌లో నోరా తన మూలాలను కూడా ప్రతిబింబించింది. మొరాకోకు చెందిన -అమాజిగ్ బెర్బర్- సంస్కృతికి చెందిన బాడీ టాటూలను ఇందులో జోడించారు. ఈ టాటూలు, బంగారు ఆభరణాల కలయిక భారత్ - మొరాకో అనే రెండు భిన్నమైన ప్రపంచాల అద్భుతమైన సమ్మేళనంలా కనిపిస్తోంది. ఈ -ఫ్యూషన్- స్టైల్ నోరా ఫ్యాషన్ సెన్స్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. నోరా ఫతేహి తన ఫిట్‌నెస్ -గ్రేస్‌తో ఈ లుక్‌కు పూర్తి న్యాయం చేసింది. కేవలం డ్యాన్స్‌లోనే కాదు.. ఫ్యాషన్ ప్రయోగాల్లోను తనే -క్వీన్- అని చాటుకుంది. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతుండటంతో.. నెటిజన్లు నోరా అందానికి .. ఆ వినూత్న ఆలోచనకు ఫిదా అయిపోతున్నారు.






## స్టైల్‌లో తగ్గేదేలే..

### జెన్-జీ ఫ్యాషన్‌తో మెస్మరైజ్ చేస్తున్న మెగాస్టార్.. బాస్ సరికొత్త లుక్ వైరల్!

త్వరలో బాబీ కొల్లి దర్శకత్వంలో కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం మెగాస్టార్ చిరంజీవి వయసును వెనక్కి నెడుతూ సరికొత్త లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. గతంలో కంటే మరింత స్లిమ్‌గా, ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్న ఆయన తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కఠినమైన క్రమశిక్షణ, నిరంతర శ్రమతో ఆయన తన ఫిట్‌నెస్‌ను ఎలా కాపాడుకుంటున్నారో ఈ లుక్ స్పష్టం చేస్తోంది. వ్యక్తిగతంగానూ ఆయనలోని ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదని, యంగ్ లుక్‌తో అభిమానులను ఫిదా చేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.ప్రస్తుత తరం ఫ్యాషన్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా, జెన్-జీ ప్రేరణతో కూడిన ట్రెండీ దుస్తులను చిరంజీవి అలవోకగా ధరిస్తున్నారు. ఆయన స్టైల్ ఎప్పటికీ ప్రత్యేకమేనని నిరూపిస్తున్నారు. సమకాలీన డ్రెస్సింగ్ అయినా, మోడరన్ ఎస్తటిక్స్ అయినా.. ప్రతి లుక్‌ను 'బాస్‘ మాత్రమే క్యారీ చేయగల ప్రత్యేకమైన స్వాగ్‌తో ప్రదర్శిస్తున్నారు.ఒకవైపు తన లుక్‌తో వార్తల్లో నిలుస్తూనే, మరోవైపు తన తదుపరి సినిమా కోసం ఆయన సిద్ధమవుతున్నారు. త్వరలోనే దర్శకుడు బాబీ కొల్లితో చేయబోతున్న కొత్త సినిమా షూటింగ్‌లో చిరంజీవి పాల్గొననున్నారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

## సిల్వర్ గౌనులో దేవకన్యలా ఊర్వశి రౌతేలా..

### కేన్స్‌లో మరోసారి తన మార్క్ చూపిన బ్యూటీ!



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 79వ ఎడిషన్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరాలో మే 12 నుంచి 23 వరకు జరిగే ఈ వేడుకకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రముఖులు హాజరయ్యారు. అలియా భట్, డెమీ మూర్ వంటి తారలు ప్రారంభోత్సవంలో తమ స్టైల్‌తో ఆకట్టుకోగా, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనదైన ప్రత్యేకమైన డ్రెస్సింగ్ స్టైల్‌తో రెడ్ కార్పెట్‌పై ప్రధాన ఆకర్షణగా నిలిచారు.

ప్రారంభోత్సవం కోసం ఊర్వశి వియత్నాంకు చెందిన ఫ్యాషన్ లేబుల్ ‘జోలీపోలీ‘ డిజైన్ చేసిన కస్టమ్ కౌచర్ గౌనును ఎంచుకున్నారు. లావెండర్ రంగు బేస్‌పై భారీ సిల్వర్ అలంకరణతో ఉన్న ఈ గౌను చూడగానే కట్టిపడేసింది. క్రిస్టల్స్, సీక్విన్స్, పూసలు, రాళ్ల వర్క్‌తో గౌను మొత్తం కేన్స్ లైట్ల వెలుగులో తళతళా మెరిసింది. మత్స్యకన్య ఆకారాన్ని పోలి ఉన్న ఈ గౌను ఆమె అందాన్ని రెట్టింపు చేసింది.

ఈ డ్రెస్ ప్రత్యేకతల్లో కార్సెట్ తరహాలో ఉన్న బాడీస్ ఒకటి. గౌనుపై శిల్పం చెక్కినట్టుగా వెండి ఎంబ్రాయిడరీతో సున్నితమైన డిజైన్లు ఉన్నాయి. స్వీట్‌హార్ట్ నెక్లైన్‌తో పాటు భుజాల వద్ద ఉన్న అలంకరణలు డ్రెస్‌కు మరింత ఆకర్షణను తెచ్చిపెట్టాయి. పొడవైన కేప్ స్లీవ్స్, వాటికి వేలాడుతున్న క్రిస్టల్ టాసెల్స్... వెండి రెక్కలు తొడుక్కున్నట్టుగా ఆకర్షించాయి.

“ఐసీ సిల్వర్“ థీమ్‌కు తగ్గట్టుగానే ఊర్వశి ఆభరణాలను ధరించారు. స్టేట్‌మెంట్ చోకర్ నెక్లెస్, దానికి సరిపోయే చెవిపోగులు, బ్రేస్‌లెట్‌తో పాటు జుట్టు ముడి మధ్యలో పక్షి ఆకారంలో ఉన్న మాంగ్ టిక్కా తరహా తల ఆభరణం అందరి దృష్టినీ ఆకర్షించింది. గౌను మొత్తం ఒకే రంగులో ఉన్నప్పటికీ, ఆమె చేతిలో పట్టుకున్న రంగురంగుల రాళ్లు, అద్దాలతో పొదిగిన బాక్స్ క్లచ్ ప్రత్యేకంగా నిలిచింది. ఇక పూర్తి గ్లామ్ మేకప్‌తో ఊర్వశి మరింత ప్రకాశవంతంగా కనిపించారు. సిల్వర్ షిమ్మర్ ఐస్, నిగనిగలాడే పెదవులు, ముఖానికి ఫ్రేమ్‌లా ఉన్న హెయిర్‌స్టైల్‌తో తన లుక్‌ను పూర్తి చేశారు.

## ఈ నెల 23న భోపాల్ లో ‘పెద్ది‘ రీసౌండ్ ఖాయం!




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం ‘పెద్ది‘ నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. సినిమా ప్రమోషన్లకు ఒక గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్‌తో కిక్ ఇచ్చేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ మేరకు మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

‘సౌండ్ ఆఫ్ పెద్ది‘ పేరుతో జరగనున్న ఈ ఈవెంట్‌లో భాగంగా సినిమాలోని ఒక ప్రత్యేక గీతాన్ని పరిచయం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. ఆయన ఈ వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నట్లు మేకర్స్ తెలిపారు. దీంతో ఈ ఈవెంట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్‌తో పాటు జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. భోపాల్ ఈవెంట్‌తో సినిమా ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు.కాగా, మే 18న పెద్ది ట్రైలర్ రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే. ముంబైలో పెద్ది ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా నిర్వహించనున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్స్ అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

# పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**జిల్లాలో పరిశ్రమల స్థాపన వేగవంతం చేయాలి**
**స్కిల్ డెవలప్‌మెంట్ లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి**
**ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగాల లక్ష్యాన్ని 1500కు పెంచాలి**
**పెండింగ్ పరిశ్రమల అనుమతులు త్వరితగతిన పూర్తి చేయాలి**
**"ఒక జిల్లా - ఒక ఉత్పత్తి"కు ప్రత్యేక ప్రాధాన్యం**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**







**నంద్యాల బ్యూరో, మే 13 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ డి ఐ ఈపిసిసమావేశంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన, వివిధ సర్వేల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో అందించడంతో పాటు పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులకు ఆధునిక అవసరాలకు అనుగుణంగా వివిధ రంగాలలో సంవత్సరం వారీగా నైపుణ్య శిక్షణ అందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రస్తుతం నిర్దేశించిన 900 ఉద్యోగాల లక్ష్యాన్ని 1500కు పెంచే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. "ఒక జిల్లా – ఒక ఉత్పత్తి" కార్యక్రమం కింద బేతంచర్ల నాపరాయి సిమెంట్ మరియు పోర్ట్‌ల్యాండ్ సిమెంట్ ఉత్పత్తులను ప్రోత్సహించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం మొత్తం 14 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానం ద్వారా ఇప్పటికే 3 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన 11 దరఖాస్తులను సంబంధిత శాఖలు గడువులోపు పరిశీలించి అనుమతి ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహంలో భాగంగా పెట్టుబడి రాయితీలు, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీల సబ్సిడీలు, పన్ను రాయితీలు వంటి ప్రభుత్వ ప్రోత్సాహకాల కింద జిల్లాలోని 10 పరిశ్రమల యూనిట్లకు రూ.81.62 లక్షల విలువైన రాయితీలను కమిటీ ఆమోదించినట్లు కలెక్టర్ వెల్లడించారు. పీఎం–సేతు పథకం కింద నంద్యాల ఐటీఐ కళాశాల అభివృద్ధికి రూ.240 కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.79 కోట్లు భరించగా, మిగిలిన రూ.41 కోట్లు స్థానిక వనరుల ద్వారా సమీకరించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో డ్రాపౌట్ అయిన విద్యార్థులను గుర్తించి వారికి నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతుల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయికి పంపే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికలను జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని తుది రూపు ఇవ్వాలని సూచించారు. కౌశలం మరియు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేల్లో తక్కువ హాజరు నమోదవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో 76 వేల మంది నమోదు చేసుకున్నప్పటికీ కేవలం 29 శాతం మాత్రమే హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు.

## కలెక్టరేట్‌లో బ్యాంబూ సేల్ కౌంటర్ నిర్మాణానికి శంకుస్థాపన



**నంద్యాల బ్యూరో, మే 13 (రిపబ్లిక్ న్యూస్):** స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం అందిస్తూ, స్వయం సహాయక సంఘాల మహిళలకు విస్తృతమైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో వెదురు (బ్యాంబూ)తో నిర్మించనున్న వినూత్న సేల్ కౌంటర్‌కు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో ఈ సేల్ కౌంటర్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యావరణహిత విధానంలో వెదురుతో నిర్మించనున్న ఈ కౌంటర్ ద్వారా స్థానికంగా తయారవుతున్న వివిధ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించనున్నారు. ఈ సేల్ కౌంటర్‌లో మెప్మా, డీఆర్‌డీఏ సెర్ప్, అటవీ శాఖకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయనున్నారు. మహిళా సంఘాలు, గ్రామీణ కళాకారులు మరియు అటవీ ఆధారిత ఉత్పత్తుల తయారీదారులకు ఇది ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచడంతో పాటు, వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడం, పర్యావరణ అనుకూల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు.

## వేసవి సెలవులు ఇవ్వని కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల పై తక్షణమే చర్యలు తీసుకోవాలి

**-ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లతీఫ్**



**నంద్యాల, మే 13, (రిపబ్లిక్ న్యూస్):** విద్యార్థులతో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల కార్యదర్శి లతీఫ్ డిమాండ్ చేశారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో ప్రస్తుతం 41 నుండి 43 డిగ్రీల వరకు తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి తరగతులు నిర్వహించడం ఆందోళనకరమని పేర్కొన్నారు.ఆళ్లగడ్డ ప్రాంతాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించడం, రెండో సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు ఈఎపిసెట్(ఎంసెట్)పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు.ఇంటర్ బోర్డు మార్గదర్శకా లను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న ఈ తరగతులు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపడమేకాకుండా వారి ఆరోగ్యానికి ప్రమాదకరమ ని హెచ్చరించారు. ఇంటర్ జూనియర్ కళాశాలలకు ఏప్రిల్ 24 నుండి జూన్ 1 వరకు సెలవులు మంజూరు చేసినట్లు ఇంటర్ బోర్డు స్పష్టం చేసినప్పటికీ అవి పట్టించుకోకపోవడం, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యాహరించడం విడ్డురం గా ఉందన్నారు. దీనివల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరుగున పడే అవకాశం ఉందన్నారు.

# 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**రెమిడియల్ క్లాసులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, మే 13 (రిపబ్లిక్ న్యూస్):** పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని గుర్రాల పేట లో ఉన్న కే.ఎన్.ఎం. మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న రాజా రెమిడియల్ క్లాసులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు, బోధన పద్ధతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి చదువుల పురోగతి, సబ్జెక్టుల వారీగా ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా బోధన చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ్యంగా తెలుగు మరియు సైన్స్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు అదనపు శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా విలేకరులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. అయితే 3,375 మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని తెలిపారు. వీరిలో కొంతమంది అన్ని సబ్జెక్టుల్లోనూ ఫెయిల్ కావడం ఆందోళనకరమన్నారు. అలాంటి విద్యార్థులు కూడా సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి, వారికి అవసరమైన విధంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ కోరారు. సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులను సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచి, ఇంటి పనులు చెప్పకుండా చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన మలుపు అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నెరవాడ గిరిజన పాఠశాలలో 'మహిళా, శిశు రక్షణ'పై అవగాహన సదస్సు

**ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి**






**నంద్యాల క్రైం, మే 13, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాలు, మహిళలు చిన్నపిల్లలపై జరిగే నేరాలు, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు పాణ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని నెరవాడ గ్రామంలో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నందు బుధవారం "ఉమెన్ & చైల్డ్ సేఫ్టీ & అవేర్‌నెస్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర కుమార్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారి కోటయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930 నంబర్కు కాల్ చేసి కానీ స్థానిక పోలీసులను కానీ లేదా జిల్లా హెడ్ క్వార్టర్ నందు గల సైబర్ క్రైమ్ కార్యాలయం నందు ఇన్స్పెక్టర్ ని సంప్రదించి సహాయం పొందవచ్చునన్నారు. చిన్నపిల్లలు, మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో చట్టాల పాత్రను వివరించారు. ముఖ్యంగా 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మీ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు గాని అనుమానాస్పద కదలికలు కానీ కనపడిన పోలీసువారికి సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం ప్రాణరక్షణకు మార్గాలని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే రాదని, ర్యాగింగ్ చేయడం చట్ట వ్యతిరేకం. ఇందుకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగాలు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సామాజిక బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దబడాలని ఆకాంక్షించారు. ఏదైనా ఆపద కలిగినప్పుడు భయం వీడి ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పూడికతీతతో పునర్జన్మ పొందిన నొస్సం పెద్ద చెరువు

**"జలదార - జలహారతి"తో రైతుల్లో కొత్త ఆశలు -500 ఎకరాల నుంచి 600 ఎకరాల సాగుకు నీటి భరోసా**

**చెరువు మట్టితో సారవంతమవుతున్న రైతు పొలాలు -"జలదార - జలహారతి"తో నొస్సం పెద్ద చెరువుడ రైతు భవిష్యత్తుకు కొత్త వెలుగు**









**నంద్యాల బ్యూరో, మే 13 (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లా సంజామల మండలంలోని నొస్సం గ్రామానికి ఆనుకొని ఉన్న పెద్ద చెరువు ఇప్పుడు గ్రామ ప్రజల ఆశలకు ప్రతీకగా నిలుస్తోంది. ఒకప్పుడు పూడికతో నిండిపోయి తన అసలు సామర్థ్యాన్ని కోల్పోయిన ఈ చెరువు, ఇప్పుడు "జలదార – జలహారతి" కార్యక్రమంతో కొత్త జీవం పొందుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పూడికతీత పనులు గ్రామ రైతాంగంలో కొత్త ఆశలు నింపుతున్నాయి.సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పెద్ద చెరువుకు చుట్టుపక్కల నాలుగు వేల ఎకరాల కొండ ప్రాంతం నుంచి వర్షపు నీరు చేరుతుంది. ప్రతి వర్షాకాలంలో కొండల నుంచి ఉరకలెత్తే నీరు ఈ చెరువులోకి చేరి నిండుగా నిల్వ అవుతుంది. చెరువుకు ఉన్న రెండు తూముల కింద దాదాపు 500 ఎకరాల సాగుభూమి ఉంది. ఈ భూముల్లో ప్రధానంగా వరి పంట సాగు చేస్తుంటారు. అయితే సంవత్సరాలుగా పేరుకుపోయిన పూడిక కారణంగా చెరువు లోతు తగ్గిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. రైతులకు అవసరమైనంత కాలం సాగునీరు అందక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యను గుర్తించిన జిల్లా యంత్రాంగం "జలదార – జలహారతి" కార్యక్రమంలో భాగంగా చెరువు పూడికతీత పనులను ప్రాధాన్యంగా చేపట్టింది. ఈ పనుల కోసం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా గారి ప్రత్యేక చొరవతో రూ.9.51 లక్షలు వెచ్చించి పనులను వేగవంతంగా అమలు చేస్తున్నారు. ఉపాధి హామీ శ్రామికులు, రైతులు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు సమన్వయంతో పనిచేస్తూ చెరువుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తున్నారు. పూడికతీత పనుల వల్ల చెరువు లోతు గణనీయంగా పెరిగింది. దీంతో ఈ ఏడాది వర్షాకాలంలో మరింత ఎక్కువ నీరు నిల్వ ఉండే అవకాశం ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 500 ఎకరాలకు పరిమితమైన సాగు విస్తీర్ణం, ఇకపై 600 ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నుంచి తీస్తున్న సారవంతమైన మట్టిని రైతులు తమ సొంత ఖర్చులతో పొలాలకు తరలించుకుంటున్నారు. ఈ మట్టితో పొలాల్లో ఉన్న గుంతలను పూడ్చడం, తెగిపోయిన గట్లను బలపరచడం, భూమి సారాన్ని పెంచడం జరుగుతోంది. దీంతో భూముల ఉత్పాదకత పెరిగి మంచి దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, "చెరువులు గ్రామీణ వ్యవసాయానికి జీవనాడి వంటివి. పూడికతీత పనులు కేవలం నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడమే కాదు, రైతుల ఆదాయాన్ని పెంచే శాశ్వత పరిష్కారంగా నిలుస్తాయి. 'జలదార – జలహారతి' కార్యక్రమం ద్వారా ప్రతి నీటి వనరును పునరుద్ధరించి గ్రామాలను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యం" అని తెలిపారు. అంతేకాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ శ్రామికులకు ఉపాధి లభిస్తుండగా, రైతులకు సాగునీటి భరోసా కలుగుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. నొస్సం పెద్ద చెరువు పూడికతీత పనులు ఇప్పుడు ఒక సాధారణ అభివృద్ధి కార్యక్రమంగా కాకుండాడ "నీటిని నిల్వ చేస్తేనే గ్రామ భవిష్యత్తు నిలుస్తుంది" అనే సందేశాన్ని ఇస్తున్నాయని కలెక్టర్ వెల్లడించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com